


# నాగలికి నా నమస్కారం

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

# నాగలికి నా నమస్కారం

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

సోమేపల్లి కవిత్వం
16-8-451, విజయపురి కాలనీ జీరో లేన్,
జె.కె.సి. కాలేజి రోడ్
గుంటూరు - 522 006

# NAAGALIKI NAA NAMASKAARAM

Somepalli Venkata Subbaiah
E-Mail: svsomepalli@gmail.com

*First Edition*: June, 2022

*Illustrations:* Paani, Vijayawada
*Cover Design:* Giridhar, Vijayawada

*Copies available at:*
SOMEPALLI VENKATA SUBBAIAH
16-8-451, 1st Floor, Srinivasa Nilayam
Vijayapuri Colony '0' Line (Cut Road)
J.K.C. College Road
GUNTUR - 522006, Andhra Pradesh

*Printed at:*
RATNA PRINTING WORKS
VIJAYAWADA / PALAKOL
Phone: 9030 663666



Rs. **60/-**



# నానీలతో నాగలికి వందనం

డా॥ సి. భవానీదేవి
ప్రముఖ రచయిత్రి, హైదరాబాద్

తెలుగు కవిత్వ రంగంలో ఆధునిక కాలంలో ప్రతి పదేళ్లకూ ఒక నవ్య కవితా రూపం సృజింపబడుతూనే వుంది. అయితే ఆ కవితా రూపాలు సృజించిన కవి, మరికొందరు అనుయాయులతోనే కనుమరుగవుతున్నాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. ఉదాహరణకు ముత్యాలసరాలు, హైకూలు, ప్రపంచపదులు ఇలా... ఇందులో హైకూ కొంతవరకు చాలామంది కలాల్లో పండింది.

1997లో ప్రముఖ కవి ఆచార్య ఎన్. గోపి గారు నిర్మించిన కొత్త కవితా రూపం "నానీ" ఇంతింతై వటుడింతై అన్నట్లు త్రివిక్రమావతారంగా తెలుగు సాహిత్యంలో తనదైన పటిష్టమైన స్థానాన్ని ఏర్పరుచుకుందంటే దాని నిర్మాణ వైచిత్రి, అక్షర నియతి, వస్తువైవిధ్యం కారణాలు.

నానీల ప్రక్రియలో తొలిరోజుల్లోనే తన ప్రతిభను అద్భుతంగా వ్యక్తీకరించిన కవిమిత్రులు సోమేపల్లి వెంకటసుబ్బయ్యగారు. తొలకరి చినుకులు, రెప్పల చప్పుడు, పచ్చని వెన్నెల, చేను చెక్కిన శిల్పాలు వంటి నానీల సంపుటాలను అలవోకగా ఆకర్షణీయమైన కవిత్వాభివ్యక్తితో అందించిన సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారి మరో నానీల సంపుటి పాఠకుల చేతుల్లో వాలుతున్నది. 'నాగలికి నా నమస్కారం' అంటూ వెలువరిస్తున్న ఈ నానీల్లోంచి చాలావరకూ పల్లెల మట్టి పరిమళం మనల్ని తాకి, తన్మయుల్ని చేస్తుంది. మొట్టమొదటి నానీలోనే పల్లె హృదయాన్ని పట్టుకున్నారు కవి.

"నేటి ప్రపంచం
ఒక కుగ్రామం
మా పల్లె మాత్రం
విశాల ప్రపంచం"

గ్లోబలైజేషన్‌లో ప్రపంచం ఒకటయ్యిందనుకుంటాం. అంతా గాడ్జెట్స్‌తో బందీలై ఎవరి ప్రపంచంలో వాళ్లు ఒంటరి నౌకల్లా సాగిపోవడం మనందరికీ అనుభవైకవేద్యమే! అందుకే ప్రపంచం కుచించుకుపోయి కుగ్రామమైంది. పల్లెల్లోకి కూడా ఎలక్ట్రానిక్

గాడ్జెట్స్ ప్రవేశించినా అంతగా మనుషుల్ని మాయం చేయలేకపోయాయి. అందుకే అది ఇంకా ఒక విశాల ప్రపంచంగా... అంటే మానవీయ భావనలతో విలసిస్తూనే వుంది. పల్లెలపై కవికున్న ప్రేమ, నిశిత పరిశీలన పాఠకులకు సూటిగా అందించే నానీ ఇది. విలాసాల పేరుతో చాలా కార్యక్రమాల్లో జరిగే ఆహార వ్యర్థానికి ఒక చురకగా –

"ఆకలి డొక్కకు
ముద్ద కరువు
విలాసాల విస్తరికి
దుబారా దరువు"

నేడు జరిగే ఫంక్షన్లలో తమ హెూదాను, ధనికత్వాన్నీ ప్రకటించుకునే ఆడంబరాల్లో జరుగుతున్న ఆహార పదార్థాల దుబారా చూస్తే ఆకలితో మాడే ప్రజలు గుర్తొచ్చి గుండె బరువెక్కక మానదు. ఆకలి డొక్కల గురించి విలాసాల విస్తరి ఎప్పుడు పట్టించుకుంటుందో అప్పుడే ఆకలి అంతమౌతుంది. ఈ నానీలో కరువు, దరువు పదాల అంత్యప్రాస ప్రయోగం పఠనీయతను పెంచుతున్నది.

పూర్వకాలంలో నీటి వసతి లేని పొలాలు బీళ్లుగా, చవుడు నేలలుగా పనికిరానివిగా పరిగణించబడేవి. 'నవ్విన నాపచేనే పండినట్లు' "చవుడు నేల ఇప్పుడు ప్లాట్లు పండిస్తున్నద"నే కవి వాక్కు ఆధునిక భూ వ్యాపారానికి అద్దం పడుతోంది. కొండలు, లోయలు, అడవులు, చెరువులు... మనిషికి భూగోళం మీది ప్రతి అంగుళం మీదా ఆశ పెరిగిపోతున్న వేళ ఇక చవుడు నేల అనే మాట మిగులుతుందనుకోలేము.

"చెత్త నుంచి
సంపద సృష్టి
బుల్లి తెర కూడా
పనికొస్తుందేమో!"

నిజమే! అందులోంచి వ్యాపిస్తున్న చెత్త కూడా కొందరికి సంపద సృష్టిస్తోందిగా. అందుకే దాన్ని 'ఇడియట్ బాక్స్' అని ముద్దుగా పిల్చుకుంటాం మరి.

"నిన్నటిదాకా
రక్షణ వలయం
పదవి పోయాక
నేర పంజరం"

ఇది చదివితే ఎందరో రాజకీయవేత్తలు లేదా రాజకీయ నేరస్తులు కళ్లముందు కదుల్తారు. పదవి దిగాక కూడా నిష్కలంక చరిత్రతో మిగిలే నాయకుల్ని ఇంక చూడం అనిపించే కాలంలో ఉన్నాం కదా! ఓటేయమని ఏ ప్రజల ఇళ్లకు తిరిగారో పదవి

వచ్చాక వారి నుంచి రక్షణ కోసం 'జెడ్' సెక్యూరిటీ వంటి రక్షణ వలయాలు ఎందుకో ఆలోచిస్తే వాళ్లు చివరికి చేరబోయే నేర పంజరాల సాక్షిగా ఆత్మన్యూనత, పాపభీతి కారణాలుగా కనిపిస్తాయి.

సోమేపల్లి వారి నానీల్లో సామాజిక విమర్శనా చైతన్యమే కాదు, ప్రకృతిలోని అందాలు అక్షరాలుగా వయ్యారాలు పోతూ పూల పరిమళాలను అందిస్తాయి.

"నల్లని నేలపై
రంగుల చీర
రాలిన పూలే
కొత్త డిజైన్లు"

కళ్లముందు అద్భుత చిత్రపటాన్ని అలవోకగా ఆవిష్కరించిన ఈ నానీకి పరవశించని ప్రకృతి ప్రేమికులుండరంటే అతిశయోక్తి కాదు.

పెళ్లిలో డబ్బు ప్రమేయం మీద ఓ చురక లాంటి నానీ రాసారు కవి. "అర్థం తెలిస్తేనే తాళి కడతాడట" అనడంలో వ్యంగ్యం వివాహ వ్యవస్థ మూలాలను ఎండగడుతూ ఆలోచింపజేస్తుంది. ఎన్నికల ముందు విగ్రహాలు కొన్నింటికి ముసుగులేస్తారు. ఎలక్షన్ కమిషన్ నిబంధనలెలా వున్నా విగ్రహాల రూపంలో ఉన్న నేతల అన్యాయాలను దాచడానికే ఈ ముసుగులు అనే కవి అధిక్షేపం నిజమే అన్పిస్తుంది.

మన జీవితాలన్నీ గూగుల్ గూట్లో దూరిపోయాయి. అదే సర్వస్వమయింది. ఇంటర్‌నెట్ లేకపోతే జీవితం గడవని స్థితి. భర్త, భార్య, పిల్లలు, బంధువులు... ఎవరున్నా లేకపోయినా స్మార్ట్‌ఫోన్ వుంటే చాలనుకునే ఒంటరి జీవులు సమూహాల్లో బతుకుతున్నట్లు నటిస్తున్నారు. అదే భావన ఈ నానీ అందిస్తుంది.

"గూగుల్
అతని దగ్గరి చుట్టం
బంధుగణమంతా
దూరం... దూరం"

రెండుసార్లు 'దూరం' అనడంలో చాలా దూరమనే నొక్కిచెప్పిన భావన. సోమేపల్లి వారి భాషలో అన్వయ క్లిష్టత వుండదు. సరళమైన పల్లె గాలి లాంటి భాష. భార్యను "అర్ధభాగమే కాదు ఆర్ద్రభాగం" అన్నారు కవి. నాకు తెలిసినంతవరకూ భార్య గురించి ఇలా ఇంతవరకూ ఎవరూ రాయలేదని చెప్పగలను. కష్టసుఖాల్లో తోడై నిలిచే ఇల్లాలికి పట్టంగట్టిన పదవిన్యాసం కవి స్వంతం.

చాలా నానీల గురించి చెప్పాలనిపిస్తుంది. కానీ పాఠకులకు రుచి చూపించి, పుస్తకంలోకి ప్రయాణం చేయించడం న్యాయం. చివరిగా ఒక్క నానీ చెప్పి ముగిస్తాను.

"చెమట చుక్కకు
చేతులు జోడించాలి
మట్టి
మరింత పరిమళం"

ఒక రైతు, పొలం, శ్రమైక జీవన సౌందర్యం, దానికి ఇవ్వాల్సిన గౌరవం మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోయే మనిషి కర్తవ్యం అని నిరూపితం చేసే వెన్నెముక ఈ నానీ. రైతు శ్రమను, చెమట చుక్కను గౌరవించిననాడే మట్టి బంగారమౌతుంది. అన్నం ముద్దగా ఆకలి తీరుస్తుంది. సోమేపల్లి గారు ఇంత మంచి నానీ రాసి ధన్యులయ్యారు. "నాగలికి నా నమస్కారం" అనే పుస్తక శీర్షికకు వన్నె తెచ్చారు. ఈ నానీల సంపుటి చదువరులను ఆకట్టుకుని, వాళ్ల ఇంటి గూళ్లలో కాకుండా నోళ్లలో నిలవాలని కోరుకుంటున్నాను. నానీల కుటుంబానికి మరింత పరిపుష్టిని చేకూరుస్తుందని ఆకాంక్షిస్తున్నాను. కవిగారిని అభినందిస్తూ పాఠకులకు స్వాగతం పలుకుతున్నాను.

మీ

శివాని

# గుండె లోతుల్లోంచి...

ఇది నా ఐదవ నానీల సంపుటి. ఈ సంపుటిలోని నానీలన్నీ ఆంధ్రజ్యోతి దినపత్రిక అమరావతి, గుంటూరు ఎడిషన్‌లో ప్రచురితమయ్యాయి. ప్రచురించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యా నికి కృతజ్ఞతలు. నా గత నాలుగు నానీల సంపుటాలు 'తొలకరి చినుకులు', 'రెప్పల చప్పుడు', 'పచ్చని వెన్నెల', 'చేను చెక్కిన శిల్పాలు', ఈ సంపుటి 'నాగలికి నా నమస్కారం' అన్నీ కలిపి త్వరలో ఒక సంకలనంగా తేవాలని అభిలాష.

ఈ పుస్తకం 'నాగలికి నా నమస్కారం' కోసం ముందుమాట వ్రాసి ఆశీస్సులు అందించిన ప్రముఖ కవయిత్రి డాక్టర్ సి. భవానీదేవి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. నానీల నాన్న ఆచార్య ఎన్. గోపి గారికి నమస్సులు.


నా అర్ధాంగి విజయలక్ష్మికి, అబ్బాయిలు శ్రీ వశిష్ట, శ్రీ విశ్వనాథ విరించికి ఆత్మీయతా ఆశీస్సులు. ఈ పుస్తకంలోని నానీలకు చక్కని చిత్రాలు వేసిన చిత్రకారుడు శ్రీ పాణి గారికి, ముఖచిత్రం వేసిన శ్రీ గిరిధర్ గారికీ కృతజ్ఞతలు.

నా తల్లిదండ్రులు శ్రీ సోమేపల్లి హనుమంతరావు, నాగరత్నం గార్ల నిరంతర స్మృతిలో...

– సోమేపల్లి వెంకటసుబ్బయ్య


నాగలికి
నా
నమస్కారం...


నేటి ప్రపంచం
ఒక కుగ్రామం
మా పల్లె మాత్రం
విశాల ప్రపంచం



రైలు ముందుకి
చెట్లేమో వెనుకకు
జీవన గమనంలో
తత్వమిదే

ఒంటరి ప్రయాణం
ఎలా అవుతుంది...?
జోడెద్దులూ
గణగణ గంటలూ






కన్నుల పండువగా
వేడుక
కొన్ని కళ్ళలో మాత్రం
కన్నీటి కాటుక

వరద
ఆగింది
కన్నీటి ప్రవాహం మాత్రం
వెల్లువెత్తుతూనే...

ఆకలి డొక్కకి
ముద్ద కరువు
విలాసాల విస్తరికి
దుబారా దరువు



నీడనైనా
కావాలనుకున్నాడు
మబ్బు
దోబూచులాడింది పాపం



పక్కపక్కనే
మండువా లోగిళ్ళు
మనసు పొరలు మాత్రం
కమ్ముకునే...




తాత అంచనా
తలకిందులు...
చవుడు నేల
ప్లాట్లు పండిస్తోంది


సేవకు
అతడి సరికొత్త భాష్యం
స్థానిక పన్నులు
అదనమట...!

వెండితెరపై
జిగేల్ జిగేల్
బతుకు పంచన
తోడేళ్ళ వంచన

మర్రిచెట్టు ఊడలే
మాకు స్ఫూర్తి
ఊరు ఇప్పటికీ
ఉమ్మడి కుటుంబమే..





చీకటిని
చీదరించుకోకు
శశి అందానికి
ఆలంబన అదేగా



సూర్యుడు చంద్రుడు
తోడూ నీడా
పొలం పందిరిలో
శ్రమ సౌందర్యం

చెత్త నుంచి
సంపద సృష్టి
బుల్లి తెర కూడా
పనికొస్తుందేమో







దమ్ముకు ధైర్యానికి
ప్రతీక
బండరాయిని
చీల్చుకొచ్చిందీ చెట్టు

ఏడాదికేడాది
పునరంకితం
వసంతంలోకి
కొత్త చిగుళ్ళలా

చెట్ల నిండా గూళ్ళు
చేల నిండా దూడలు
ఊరు మనసు
ఉరకలు



నిన్నటి దాకా
రక్షణ వలయం
పదవి పోయాక
నేర పంజరం



డబ్బుల మబ్బులు
కమ్మేస్తున్నాయి
ఎన్నికల వానకు
వేళయింది



వాళ్లిద్దరూ
జీవిత ఖైదీలే
సంసారమనే
సాగరంలో


చెట్లకు
డబ్బులు కాయకపోవచ్చు
ఓట్లకు మాత్రం
నోట్లు పుష్కలం

కాలుష్య మేఘం
కమ్ముకుందా
ఎన్నికల వర్షానికి
సంకేతమేమో



ఊరు ఊరంతా
పాలాభిషేకాలు
వెలిశాడేమో
మరో స్వామీజీ!


ఊరి సరస్సులో
రాజకీయ మొసళ్ళు
ఓటరు గజరాజులూ
జాగ్రత్త




ఉన్నపళంగా
ఊర చెరువు
క్రికెట్ క్రీడాస్థలి
అయ్యిందేమిటి...!?

నల్లని నేలపై
రంగుల చీర
రాలిన పూలే
కొత్త డిజైన్లు







చెప్పులే నయం
జోడీ వీడవు
మనుషులే
తోడు నిలవరు

ఏటి ఒడ్డున
ఎప్పుడూ దాహమే
చెట్లు నీళ్లలోకి
తొంగి చూస్తూనే

అదొక
విచిత్ర వాదం
కులానికో ప్రత్యేక రాష్ట్రం
కావాలంటాడు



ప్రేమ లేఖ
రాసిందనుకున్నా
తీరా చూద్దును కదా
తెల్ల కాగితం



చెమట చుక్కకు
చేతులు జోడించాలి
మట్టి
మరింత పరిమళం




విజయం సాధించాడు
అవయవ దాత
నిస్సహాయంగా
యమదూత

నల్లని నేలపై
ఎర్రని తివాచీ
రైతు కళ్ళల్లో
అరుణ కాంతి

పైర గాలి
పరవశం
తుమ్మెదల పాట
కంకుల సయ్యాట

ఎప్పుడు చూసినా
హడావుడే
అది దేవాలయమా
ఆసుపత్రా...




చొక్కాల నిండా
సిరా మరకలు
ఇంకేంటీ...
పరీక్షలయ్యాయి కదా



పెనం మీద నుంచి
పొయ్యిలోకి
పల్లె జీవనం
పట్టణానికి

ఇది
అతివృష్టా అనావృష్టా
పొలాన్ని అడగండి
చెప్తుంది






ఈ-పెళ్లికి
తప్పకుండా వెళ్ళాలి
వాట్సాప్ పెట్టి మరీ
పిలిచారు

అన్నదాతకి
అజీర్తి
అధికంగా పెడుతోంది
నీటి బువ్వ

గుడిసె గుండెల్లో
గుబగుబలు
సిమెంటు తూరలే
భవంతులు






ఇంటింటికీ
న్యాయస్థానం
ఎవరి వాదన వారిది
వేదన అందరిదీ

వృక్షం
అతని ప్రత్యక్ష దైవం
అందుకేగా
అర్ఘ్యమూ పాద్యమూ


కంచె
చేను మేసిందట
మంచె
మంచి నిద్రలో ఉందన్నమాట



ఊట బావీ
పంట కుంటా
దారి తప్పిన ఊరు
నేడు నీళ్ళకై కుంటుకుంటూ

చెట్లదీ
సమైక్య రాగమే
గాలి ఎటు వీస్తే
కొమ్మలూ అటే


పెంపుడు కుక్క
ప్రేమ ఖైదీ
మెడకో గొలుసు
మది గదిలో బందీ



ఊరు ఊరంతా
పరిశుభ్రత
చిత్తంలోనే
చెత్త పేరుకుపోయింది



పువ్వులే కాదు
గువ్వలూ నవ్వుతాయి
గుండె గూట్లో
గుసగుసల సరాగాలు




విజయమో
వీరమరణమో
సంక్రాంతికి
కోడిపుంజుల వంతు




పెళ్లి మీదే
పరిశోధన
'అర్థం' తెలిస్తేనే
తాళి కడతాడట

కల్మషాకాశంలో
ఉరుములు
బక్క బతుకు
కన్నీటి మడుగు




కళ్ళల్లో
మనసు పెట్టి చూడు
వెలుగు
అదే కనిపిస్తుంది


అతడు
ఉనికినే కోల్పోయాడు
మూలాలను మరవటం
ఓ లెక్కా



ఇంటి సిగపైన
జలభాండం
మనిషి ఒంటికి
తల ప్రాణం

ఆకాశానికి
వెలుతురు మెట్లు
బహుళ అంతస్తులది
బడాయి






చేతి రాతే
అనుకున్నా
మతిపోకడ కూడా
వంకర టింకర

బారులు తీరినట్టు
పచ్చని చెట్లు
పేరంటంలో
ముత్తైదువుల్లా


తిమిరంతో
సమరం చేస్తావా?
అయితే ముందుగా
నీతో చెయ్యి



విగ్రహాలకు
ఎన్నికల ముసుగు
అన్యాయం కూడా
కనిపించకూడదేమో



అర్ధభాగమే కాదు
ఆర్ద్ర భాగం కూడా
సంసార రథానికి
ఆమె ఇరుసు



వేదికపై
ఏకపత్నీవ్రతుడు
జీవితం
బహు కళత్ర క్రతువు


కుటుంబం
కూలిపోయింది
ప్రేమాభిమానాలు
ఎక్కడ వాలాయో?

విమానం
ఎక్కలేదనేది పాత మాట
ఇవాళ
భూమి జీవన వ్యోమనౌక




నెలారంభంలో
అపర కుబేరుడు
నెలాఖరులో
కుచేలుడు


పైకి ఎక్కే
ఆకాశ సౌధాలు కాదు
గూళ్ల లాంటి
బడుగు లోగిళ్లు



చేను నిండా
పంట కాలువలే
నాగటి చాళ్లలో
నవ్వుల పువ్వులు



ఆమె బతుకంతా
బజారులోనే
పాలరాతి సమాధితో
తల్లి రుణం చెల్లు




అతడికి
ఒళ్ళంతా కళ్ళే
మనసు మాత్రం
మహాంధకారం

పల్లె సిగలో
సిరిసిరి మల్లి
ఎవర్గ్రీన్
మావూరి మానుమద్రి


భూమికి వంగిన
హరివిల్లు కాదు
నాట్లు వేసే
కూలి తల్లి



రంగస్థలంపై
రారాజు
బతుకు కళావేదికపై
ఒట్టి బూజు



కాపలా కోసమే కాదు
మంచె
పంట పరిమళం
పంచేందుకు కూడా




చిన్నప్పటి
పంతులు గుర్తొచ్చాడు
చేతులు మొట్టికాయల్ని
తడుముకున్నాయి

సూదికి దారం
ఆధారం
చిరిగిన జీవితాలకు
సంధానం

జలపుష్పాలకు
గాలం ఎర
ఓటరు దేవుడికి
తాయిలాల లాగా


అగ్గిలో బుగ్గయ్యింది
ఆస్తులే కాదు
అపురూపమైన
జీవితం కూడా



అక్షరం కన్నా
ఆకలిదే ఆకర్షణ
బడి బుడతల
మధ్యాహ్న భోజనం



పుట్టేది
ఆడా మగా చెప్పుకో
అయితే
ఎస్సెమ్మెస్ పోల్ షురూ చేద్దాం




ఆంధ్రాలో
అమెరికా బతుకులు
వృద్ధాశ్రమాల్లో
పెద్దల వెతలు




వేసవిలోనూ
వసంతం
బడి పిల్లలకు
సెలవులు సొంతం

చూడు
కార్లకు ఎంత షోకో
ఎక్కడ చూసినా
బ్యూటీ పార్లర్లే

గూగుల్
అతని దగ్గరి చుట్టం
బంధుగణమంతా
దూరం దూరం



అలలపై
కట్టడాలు కాదు
వరద ముంచిన
సమాధులు



చేను చెక్కిలిపై
హరిత సంతకం
రైతు సంబరానికి
హద్దు అంబరం




అమ్మ కడుపు
అర్ధాకలి
మనసు
మమతల పూర్ణకుంభం




పచ్చని చెట్లు
వెన్నెల మెట్లు
పరవశిస్తూ
పరిమళిస్తూ

అయినవారి కంటే
చెట్టే నయం
వృద్ధాప్యంలో
ఊతకర్రవుతుంది



ఆధునిక
నివాస సౌధాలు
ఏకాంత వాస
కారాగారాలు

బిడ్డకు పాలిచ్చే
చోటు చూపరు
గడ్డను
పాలిస్తామంటారు




అతడు
మహానటుడే
శవం పాత్రలో కూడా
జీవించేస్తాడు

పది మంది ఒక ఇంట్లో
అప్పుడు
పది గూళ్లలో ఒక్కొక్కరు
ఇప్పుడు..




మా ఇల్లు
ఒంటరిది కాదుగా
చుట్టూ
చెట్టూ చేమా గొడ్డూ గోదా

చిగురే
చేనుకు చిరునామా
చెలిమే
జీవన శాశ్వత వీలునామా



గాలిలో
తేలిపోవడం లేదు
తాడుకు వేలాడుతూ
తాపీ పని...

స్వచ్ఛమైన
గాలి కావాలా
అచ్చమైన అడవే
ఆక్సిజన్ బాటిల్



కాళ్లకు
కళ్లొచ్చాయా
పరువం
ఉరకలేస్తే అంతేగా మరి



తెరపైనే కాదు
నవరస నటన
ప్రకటనల
ప్రహసనం కూడా

గాలికొకటి
ధూళికొకటి
రోడ్డు వెడల్పులో
పూటకో గూడు సమాధి

పచ్చని చెట్టూ
వాణిజ్య వస్తువే
చుట్టూరా
వ్యాపార ప్రకటనలే




అపర
గాంధేయుడతడు
చేతులతో
చిత్రహింస పెట్టడు!



మూతికి చిక్కం
మెడలో గుదిబండ
కనిపించని మూడో బానిస
పాలేరు

పుడమి తల్లి
కడుపు ఎండింది
అందుకే
నెర్రెలు నెర్రెలు




సామేపల్లి
కవిత్వం

నాగలికి నా నమస్కారం

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

5వ
నానీల
సంపుటి



సో
మేపల్లి
కవిత్వం